క్లుప్తంగా

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు



సత్తెనపల్లి: చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని పుట్ బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కె.సుబ్రహ్మణ్యేశ్వరరావు అన్నారు. ఆంధ్రప్రదేశ్ పుట్‌బాల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కోటగిరి శ్రీధర్ జన్మ దిన వేడుకలు పట్టణంలోని సుగాలీ కాలనీ జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో మంగళ వారం నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్యేశ్వరరావు మాట్లాడుతూ శ్రీధర్ అసోసియేషన్ పలు పదవులను అలంకరించి, విశేష సేవలందించారన్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి, శుభాకాంక్షలు తెలిపారు. క్రీడాకారులకు పుట్ బాల్స్, క్రీడా దుస్తులు పంపిణీ చేశారు.

రామరాజు మృతి కళా రంగానికి తీరని లోటు



సత్తెనపల్లి: రచయిత, దర్శకుడు, గాయకుడు, డాక్యుమెంట్ రైటర్ రామరాజు వెంకట అప్పారావు మృతి కళా రంగానికి తీరని లోటు అని పలువురు కళాకారులు, రాజకీయ నాయకులు అన్నారు. రామరాజు వెంకట అప్పారావు ఇటీవల మృతి చెందడంతో పట్టణంలోని ఓ కల్యాణ మండపంలో మంగళవారం సంతాప సభ నిర్వహించారు. సాంఘిక, పౌరాణిక ఇలా ఎన్నో పాత్రలు పోషించి, తనకంటూ ఒక ప్రత్యేకత ఏర్పరచుకున్న మహా మనిషి రమరాజు వెంకట అప్పారావు అని కొనియాడారు. ఆయన ఆత్మకి శాంతి కలగాలని ప్రార్థించారు.వెంకట అప్పారావు చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. పట్టణ రంగస్థల కళాకారులు, వివిధ పార్టీలకు చెందిన రాజకీయ నాయకులు, కళా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

పోలీసుల సేవలు వెలకట్టలేనివి



సత్తెనపల్లి: పోలీసు సేవలు వెలకట్టలేనివని రూరల్ ఎస్‌హెచ్‌ఓ పోలూరి శ్రీనివాసరావు అన్నారు. పోలీస్ అమర వీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా చత్తీష్ ఘడ్ వద్ద మావోల దాడిలో బలైన గుడిపూడి గ్రామానికి చెందిన సీఆర్‌పీఎఫ్ జవాన్ శాఖమూరి మురళీకృష్ణ విగ్రహానికి మంగళవారం పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్‌హెచ్‌ఓ శ్రీనివాసరావు మాట్లాడుతూ పోలీసులు ప్రతికూల పరిస్థితుల్లోనూ మొక్కవోని ధైర్యంతో విధులు నిర్వహించి శాంతిభద్రతలను కాపాడుతున్నారన్నారు. రూరల్ ఎస్‌ఐ షేక్ అమీనుద్దీన్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సాఫ్ట్ బాల్ జట్టుకు విద్యార్థుల ఎంపిక



అచ్చంపేట: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-14 సాఫ్ట్ బాల్ రాష్ట్ర స్థాయి జట్టుకు తమ పాఠశాల విద్యార్థులు ముగ్గురు ఎంపికైనట్లు కొండూరు జెడ్పీహెచ్ స్కూలు హెచ్‌ఎం బి.వి జయకుమారి మంగళవారం తెలిపారు. ఈ నెల 19న ఉమ్మడి గుంటూరు జిల్లా స్థాయి పోటీలు నర్సరావుపేటలోని ఎస్ఎస్ఎన్ కళాశాలలో జరిగాయన్నారు. 9వ తరగతి విద్యార్థులు డి.ప్రసన్న, ఎస్.దేవమణి, 8వ తరగతి విద్యార్థి ఎ.క్రాంతికుమార్ ప్రతిభ కనబరిచారని చెప్పారు. ఈ నెల 16 నుంచి చిత్తూరులో జరిగే పోటీలలో ముగ్గురు విద్యార్థులు పాల్గొంటారన్నారు. ఎంపికైన విద్యార్థులను, శిక్షణనిచ్చిన పీఈటీ వి.వేమారెడ్డిని ఉపాధ్యాయులు అభినందించారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

గోళ్ళపాడు(ముప్పాళ్ళ): అధిక వర్షాల నుంచి పంటను కాపాడుకునేందుకు యాజమాన్యపద్ధతులు పాటించాలని మండల వ్యవసాయాధికారి ఎం.అరుణ చెప్పారు. మండలంలోని గోళ్ళపాడు, కుందురువారిపాలెం గ్రామాల్లో పొలం పిలుస్తొంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. అధిక వర్షాల నుంచి పంటను రక్షించుకునే మార్గాలను రైతులకు వివరించారు. లింగాకర్షక బుట్టలు వాడటం వలన గులాబీరంగు పురుగు ఉధృతిని తగ్గించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ డేవిడ్‌రాజు, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.



చిరు పొట్ట దశలో వరి పైరు



కలిసిరాని ఖరీఫ్

అన్నదాతలపై ప్రకృతి ప్రకోపం

వరుస తుపానులతో వరిపై ప్రతికూల ప్రభావం

- అతివృష్టి లేకుంటే అనావృష్టి
- చిరు పొట్ట దశలో ఉన్న వరి పంట
- తాలుగింజ తేలుతుందని రైతుల ఆందోళన
- దోమ పోటుతో మరింత కలవరపాటు

నకరికల్లు: అకాల వర్షాలు అన్నదాతలను బెంబేలెత్తిస్తున్నాయి. తుపాను వెంట తుపాను నెల రోజులుగా వారి రైతులను కలవర పెడుతున్నాయి. మండలంలో ఈ ఏడాది ఖరీఫ్ వరి సాగు ఆశనిరాశల మధ్య ప్రారంభమైంది. ఆగష్టు చివరి వారం వరకు సాగు నీరు లేదని నిరాశ పడ్డ రైతన్నలకు.. అధిక వర్షాలు ఊరటనిచ్చాయి. నాగార్జున సాగర్ నిండడంతో పంట కాల్వలకు నీరు విడుదల చేశారు. దీంతో నారు కొని మరీ వరి సాగు చేశారు. ప్రస్తుతం వరి 15 వేలు, మిర్చి 1,050, పత్తి 100, కంది 120 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. ఇప్పటి వరకు వరికి ఎకరాకు రూ.20 వేల వరకు పెట్టుబడి పెట్టారు. పంట చిరు పొట్ట దశకు చేరుకుంది. ఈ దశలో వరుస తుపాన్‌లు అన్నదాతకు ఆశలపై నీళ్ల చల్లుతున్నాయి.

అసలు సమస్య ఇదీ..

గత నెల రోజులుగా రోజు మార్చి రోజు తప్పనిసరిగా వర్షం పడుతోంది. వెంటనే విపరీతమైన ఎండ కాస్తోంది. వాతావరణంలో లోపిస్తున్న సమతుల్యత, అకాల వర్షాలు వరి పంటపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపిస్తున్నాయి. దీంతో పంట నష్టపోయే పరిస్థితి రైతుకు నెలకొంది. వరి పొట్ట దశలో ఉన్నప్పుడు వర్షపు చుక్కలు గింజలో చేరి గింజ తాలుగా మారి పూర్తిగా నిరుపయోగంగా మారిపోతుంది. దీనికి తోడు తెల్లదోమ ప్రభావం అధికంగా పంటలో కనిపిస్తోంది. అతివృష్టి లేకుంటే అనావృష్టి అన్న చందంగా మారిందని అన్నదాతలు వాపోతున్నారు.

నకరికల్లు భూమిలో పండించిన వరి ధాన్యం అధిక నాణ్యత, గింజ గట్టిదనం, రుచి కలిగి ఉంటుంది. రాష్ట్ర వ్యాప్తంగా కూడా మంచి పేరు ఉంది. నకరికల్లు బియ్యం అంటూ బోర్డులు పెట్టి మరీ కృష్ణా, గోదావరి జిల్లాల్లోని దుకాణాల్లో విక్రయిస్తుంటారు. ఇక్కడి నుంచి తిరుపతికి కూడా భారీగా బియ్యం ఎగుమతి చేస్తుంటారు. లాభనష్టాలు పక్కన పెట్టి ప్రజల ఆకలి తీర్చడమే లక్ష్యంగా పెట్టుకొని చమటోడ్చి ఆహార ధాన్యం ఉత్పత్తి చేసే అన్నదాతలపై ప్రకృతి ప్రకోపిస్తోంది.

నష్టం మీద నష్టం



వరి పంట సాగు నష్ట మిగుల్చుతోంది. ఆరుగాలం శ్రమించి పంట సాగు చేస్తే చేతి కొచ్చే సమయానికి ఏదో ఒక రూపంలో నష్టం వెంటాడుతోంది. ఈ ఏడాది వరుసగా కురుస్తున్న వర్షాలతో గింజ తాలుగా మారే అవకాశం ఉంది. పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి.

– బెల్లంకొండ పుల్లయ్య, రైతు, నకరికల్లు

ఇన్ని తుపానులు ఎప్పుడూ చూడలేదు



ఈ ఏడాది వచ్చినన్ని తుపానులు ఎన్నడూ చూడలేదు. నెలరోజులుగా ఒకటే వర్షాలు. వరి పొట్ట దశలో ఉంది. ఇప్పుడు పడుతున్న వర్షాలతో దోమ పోటు, తెగుళ్లపోటు అధికంగా ఉంది. ఇక పంటలను ఆ దేవుడే కాపాడాలి.

– పరసా పెద్దబ్బాయి, రైతు, నకరికల్లు

సస్యరక్షణతో పంటలను కాపాడుకోవచ్చు



ప్రసుత్తం మండలం పరిధిలో వరి చిరు పొట్ట దశలో ఉంది. పైరుకు పైపాటుగా ఎకరానికి 20 కేజీల యూరియా, 20-25 కేజీల పొటాష్ బురద పొలంలో చల్లాలి. దీంతో గింజ నాణ్యత తగ్గకుండా కాపాడుకోవచ్చు. గోధుమ వర్ణం, తెల్ల దోమలు ఒక్కో దుబ్బుకు 20 -25 ఉన్నట్లయితే అధికారులు సూచించిన మందులను వినియోగించాలి.

– కె.దేవదాసు, ఏఓ, నకరికల్లు

గ్రామ సభలతో భూ సమస్యలకు పరిష్కారం



బొల్లవరం(ముప్పాళ్ళ): రీ-సర్వే పూర్తయిన గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను అప్పటికప్పుడు పరిష్కరించేందుకే గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జ్ తహసీల్దార్ సీహెచ్ లక్ష్మీప్రసాదు చెప్పారు. మంగళవారం బొల్లవరంలో జరిగిన గ్రామ సభలో ఆయన పాల్గొని, అర్జీలు స్వీకరించారు. రీ-సర్వే పూర్తయిన గ్రామాల్లోని సమస్యలను గ్రామ సభల ద్వారా పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. డీటీ విజయ్‌కుమార్, మండల సర్వేయర్ సుధాకర్, వీఆర్వో సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

బేస్ బాల్ పోటీలకు విద్యార్థుల ఎంపిక



క్రోసూరు: స్థానిక సెయింటాన్స్ పాఠశాల విద్యార్థులు ముగ్గురు బేస్ బాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రిన్సిపల్ సిస్టర్ మేరీ రజిత మంగళవారం తెలిపారు. మందపాడు జెడ్పీ పాఠశాలలో సోమవారం జరిగిన స్కూల్ గేమ్స్ బేస్ బాల్ పోటీల్లో అండర్ 17 విభాగంలో కె.పూజిత, అండర్ 14 విభాగంలో షేక్ ఇష్టతానియా, వి.బిందు ఎంపికైనట్లు చెప్పారు. వ్యాయామ ఉపాధ్యాయుడు వెంకట్రావు, విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోవాలి

రాజుపాలెం: ఉమ్మడి కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు కోసం గ్రాడ్యుయేట్స్ దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దారు దుర్గేష్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నవంబరు 6వ తేదీ లోపు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు.

ఎలుకల నివారణ మందు పంపిణీ



ఎలుకల నివారణా మందును తయారు చేయిస్తున్న ఏఓ శ్రీధర్‌రెడ్డి



కస్తల రైతు సేవా కేంద్రంలో మందును పంపిణీ చేస్తున్న ఏడీఏ హనుమంతరావు

సత్తెనపల్లి/అచ్చంపేట/అమరావతి/క్రోసూరు/ముప్పాళ్ళ/రాజుపాలెం/నకరికల్లు: వరి పంట సాగు చేసిన రైతులు తమ పొలంలో సామూహిక ఎలుకల నివారణా మందును పెట్టాలని వ్యవసాయశాఖ అధికారులు సూచించారు. ఈ మేరకు రైతు సేవా కేంద్రాల్లో మంగళవారం బ్రోమోడయోలీన్ అనే ఎలుకల మందును ఉచితంగా పపంపిణీ చేశారు. ప్రతి గ్రామంలో వరి సాగు విస్తీర్ణం ఆధారంగా మందును పంపిణీ చేయడం జరిగిందని చెప్పారు. ఎలుకల మందు విషపు ఎరను రైతుల ద్వారా తయారు చేయించి, వరి పండించే రైతులకు పొలం గట్లపై, ఎలుక కన్నాల వద్ద పెట్టాలని సూచించారు.

■ సత్తెనపల్లి మండల వ్యవసాయ అధికారి ఎస్.శ్రీధర్ రెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ శాఖ ద్వారా ఉచితంగా బ్రోమోడయోలీన్ అనే ఎలుకల మందును అన్ని రైతు సేవా కేంద్రాల ద్వారా పంపిణీ చేశారు.

■ అచ్చంపేటలోని కస్తల గ్రామంలో జరిగిన ఎలుకల మందు పంపిణీ కార్యక్రమంలో వ్యవసాయ సహాయ సంచాలకులు వి.హనుమంతరావు పాల్గొన్నారు. ఎలుకల నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలు, నివారణ మందు తయారీని ప్రయోగాత్మకంగా వివరించారు. ఏవో వెంకటేశ్వర్లు, వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

■ అమరావతి మండల వ్యవసాయాధికారి ఎస్కే ఎఫ్.అహ్మద్ లింగాపురం క్షేత్ర సందర్శన చేపట్టారు. రైతులకు వరి సాగులో ఎలుకల నిర్మూలనపై అవగాహన కల్పించారు.

■ క్రోసూరు రైతు సేవా కేంద్రంలో మండల వ్యవసాయ అధికారి వేణుగోపాల్ రైతులకు సామూహిక ఎలుకల నిర్మూలనపై అవగాహన కల్పించారు. మందు తయారీని వివరించారు. రైతు సేవా కేంద్ర సిబ్బంది గోపి పాల్గొన్నారు.

■ ముప్పాళ్ళ మండల వ్యవసాయాధికారి ఎం.అరుణ అన్ని గ్రామాల్లోను వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో సామూహిక ఎలుకల నివారణ మందు పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. మందు ఉపయోగాలను వివరించారు.

■ రాజుపాలెం మండల వ్యవసాయాధికారి పి.వెంకటనర్సయ్య అనుపాలెం, అంచులవారిపాలెం ఈ కార్యక్రమంలో వీఏఏ డి.వెంకటేష్, ఆర్.సుచరిత, నాయకులు తోట నర్సయ్య, అంచుల నరసింహారావు, గ్రంధి శ్రీనివాసరావు, వీర్ల వెంకటస్వామి పాల్గొన్నారు.

■ సహాయ వ్యవసాయ సంచాలకులు బి.శ్రీకృష్ణదేవరాయలు ఎలుకల నివారణకు బ్రోమోడయోలిన్ ఎర మందును చీమలమర్రి గ్రామంలో రైతులకు మంగళవారం ఉచితంగా పంపిణీ చేశారు. మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి గ్రామ సభ

సత్తెనపల్లి: భూ సమస్యలను గ్రామ సభలో పరిష్కరించుకోవచ్చని తహసీల్దార్ కేఎస్ చక్రవర్తి తెలిపారు. గోరంట్ల గ్రామంలో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ గ్రామ సభలో ఆయన పాల్గొని, మాట్లాడారు. రీ సర్వేలో ఎలాంటి తప్పిదాలు జరిగినా సంబంధిత పత్రాలతో హాజరై వాటిని సవరించుకోవాలన్నారు. రైతుల నుంచి అందించిన 19 అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ వై. శ్రీనివాసరావు, సీనియర్ అసిస్టెంట్ బోసుబాబు, వీఆర్వో జి.కిరణ్‌కుమార్, గ్రామ సర్వేయర్ షేక్ రూహుల్లా ఉన్నారు.

సవరణకు మరో అవకాశం



నకరికల్లు: రీ సర్వేలోని లోటుపాట్లు సరిచేసుకునేందుకు మరో అవకాశం కల్పిస్తున్నట్లు తహసీల్దార్ కె.పుల్లారావు తెలిపారు. చేజర్ల గ్రామంలో గ్రామ సభ మంగళవారం నిర్వహించారు. సభలో తహసీల్దారు పాల్గొని, మాట్లాడారు. ఫొటో, విస్తీర్ణంలో, పేర్లు, సర్వే నంబర్లలో సవరణలకు రైతుల నుంచి అర్జీలు స్వీకరించినట్లు చెప్పారు. చేజర్ల గ్రామం నుంచి 32 అర్జీలు వచ్చాయని తెలిపారు. డిప్యూటి తహసీల్దార్ శ్రీనివాసరావు, మండల సర్వేయర్ వెంకటేశ్వర్లు, వీఆర్వో రమణారెడ్డి, విలేజ్ సర్వేయర్ మణికంఠ పాల్గొన్నారు.

ఆధార్ నవీకరణకు ప్రత్యేక క్యాంపులు



సత్తెనపల్లి 9వ సచివాలయంలో ఆధార్ నవీకరణ



నవీకరణ ఆధార్ కార్డును అందజేస్తున్న సచివాలయ కార్యదర్శి శివప్రసాద్

సత్తెనపల్లి: ఆధార్ కార్డులో తప్పు ఒప్పులను సవరించుకొని, సమస్యల పరిష్కారానికి ప్రత్యేక క్యాంపులు దోహదం చేస్తాయని మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి, సత్తెనపల్లి ఎంపీడీవో బండి శ్రీనివాసరెడ్డి అన్నారు. పట్టణంలోని వడ్డవల్లి పాతసాలిపేట సచివాలయంలో, సత్తెనపల్లి రూరల్ మండలంలోని కొమెరపూడి, కంకణాల పల్లిలో మంగళవారం నిర్వహించిన ఆధార్ నవీకరణ ప్రత్యేక క్యాంపుల్లో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆధార్ కార్డుకు వయసుతో నిమిత్తం లేదని, అప్పుడే పుట్టిన పిల్లలకు కూడా ఆధార్ తీసుకునే వీలు ఉందన్నారు. 10 ఏళ్ల దాటిన వారు తమ వేలి ముద్రలు, కనుపాపల పునర్వీకరణ చేయించుకోవాలని సూచించారు. కొత్త ఆధార్ కార్డుల నమోదు, వేలిముద్రలు, చిరునామాలు, వ్యక్తిగత ఫోటో నవీకరణ, మొబైల్ నెంబర్ మార్పు, ఇతర దోషాలు సవరించుకునేందుకు ఈ శిబిరాలను వినియోగించుకోవాలన్నారు.

నకరికల్లు: స్థానిక సచివాలయం కార్యదర్శి కె.వి.శివప్రసాద్ స్థానిక సచివాలయంలో ఆధార్ నవీకరణ ప్రత్యేక శిబిరాన్ని మంగళవారం పరిశీలించారు. ఈ నెల 23, 24, 25 తేదీల్లో ఆధార్ ప్రత్యేక శిబిరం ఉంటుందన్నారు. డిజిటల్ అసిస్టెంట్ శాంతి, సిబ్బంది పాల్గొన్నారు.

రాజుపాలెం: ఈ నెల 23, 24 తేదీల్లో రెడ్డిగూడెం సచివాలయం, బుధవారం నెమలిపురి సచివాలయం, 24, 25న అనుపాలెం సచివాలయం, 25న గణపవరం గ్రామ సచివాలయంలో ఆధార్ స్పెషల్ క్యాంప్‌లు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సత్యనారాయణ మంగళవారం తెలిపారు.

బాలుడి అదృశ్యంపై ఫిర్యాదు



శ్రీహరి

దాచేపల్లి : బాలుడి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సౌందర్‌రాజన్ మంగళవారం తెలిపారు. పిడుగురాళ్ల మండలం చిన్న అగ్రహారం గ్రామానికి చెందిన నల్లబోతుల వెంకటేశ్వర్లు, భ్రమరాంబ కుమారుడు శ్రీహరి కేసానుపల్లి గీతా గురుకులంలో 10వ తరగతి చదువుతున్నాడు. దసరా సెలవుల అనంతరం ఈ నెల 16న తల్లి భ్రమరాంబ కొడుకుని స్కూల్‌కు పంపేందుకు దాచేపల్లిలోని కారెంపూడి బస్టాండ్ వద్ద బస్సు ఎక్కించి, ఇంటికి వెళ్లింది. నాలుగు రోజులు గడచిన తరువాత స్కూల్ యజమాన్యం శ్రీహరి స్కూల్‌కి రావడం లేదని సమాచారం అందించారు. తల్లి దండ్రులు స్కూల్‌కి వచ్చి యజమాన్యంతో మాట్లాడారు. కుమారుడి ఆచూకీ లభించకపోవటంతో దాచేపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

అప్డేట్ అవ్వాల్సిందే

- ఆధార్ నవీకరణతో పథకాలకు అర్హత
- ఉచిత సవరణకు అవకాశం
- సచివాలయాల్లో ఈ నెల 25వ తేదీ వరకు ప్రత్యేక శిబిరాలు

బెల్లంకొండ: ప్రస్తుతం ఆన్‌లైన్ యుగం నడుస్తోంది. ప్రతీది డిజిటలైజేషన్ అవుతున్న తరుణంలో ఏ పని జరగాలన్నా అందుకు ఆధార్ కార్డు మూలమైంది. పాఠశాలలో పిల్లలు చేరాలన్నా, వయోవృద్ధులు పింఛన్ తీసుకోవాలన్నా ఆధార్ తప్పనిసరి. ప్రభుత్వాలు అమలు చేసే పథకాల లబ్ధికి ఆధార్‌లో వివరాలు పక్కాగా ఉండాలి. లేకుంటే ఇక అంతే సంగతులు. పేరు, చిరునామా, వివరాల్లో తప్పులు దొర్లడం, సాంకేతిక సమస్యలతో ప్రస్తుతం చాలా మంది ఇబ్బందులు పడుతున్నారు. కొంతమంది ఈ సవరణలు ఎక్కడ చేస్తారో ఇప్పటికీ తెలియదంటే ఆశ్చర్యం లేదు.

ప్రత్యేక ఆధార్ క్యాంపులు

సాంకేతిక సమస్యలతో పథకాల లబ్ధిని పేదలు, మధ్య తరగతి ప్రజలు కోల్పోకూడదని కేంద్ర ప్రభుత్వమే చొరవ తీసుకుంటోంది. ఆధార్‌కార్డులో సవరణలకు, ఆప్‌డేట్‌కు ప్రత్యేక ఆధార్ క్యాంపుల నిర్వహిస్తోంది. ఈ క్యాంపులు గత సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ నెల 25 వరకు ప్రత్యేక ఆధార్ నవీకరణ శిబిరాలు నడుస్తున్నాయి. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రారంభించిన సచివాలయ వ్యవస్థ ఈ ప్రక్రియకు తోడ్పాటునిస్తోంది. 2023 అక్టోబర్, 2024 ఆగస్టులో దశల వారీగా నవీకరణ కేంద్రాలను నిర్వహించారు. కేంద్రాలను పెంచుతూ ఈ ప్రక్రియను మరింత వేగవంతం చేశారు. మండలానికి రెండు నుంచి నాలుగు శిబిరాలు చొప్పున కేంద్రాలను ఏర్పాటు చేశారు. నాలుగు రోజులపాటు శిక్షణ పొందిన డిజిటల్ అసిస్టెంట్లు కేంద్రాల్లో ఆధార్ నవీకరణ సేవలు అందిస్తారు. ఉదయం 10 గంటల నుంచి కేంద్రాలు ప్రారంభమవుతాయి.

12 ఏళ్లకు ఒకసారి అప్డేట్

తొలిసారిగా 2011లో కేంద్ర ప్రభుత్వం ఆధార్ కార్డులను జారీ చేసింది. అప్పటినుంచి నవీకరణ పెద్ద సమస్యగా ఉండేది. 12 ఏళ్లకు ఒకసారి ఆధార్ అప్డేట్ చేయించుకోవాలని కేంద్రం స్పష్టం చేసింది. ఆ మేరకు 2011 నుంచి 2016 లోపు ఆధార్ పొంది, అప్పటి నుంచి అప్డేట్ చేసుకోని వారి కోసం గతంలో పలుమార్లు ప్రత్యేక శిబిరాల్లో అప్డేట్ అవకాశం కల్పించింది. ఈ సారి శిబిరాల ప్రధాన లక్ష్యం అప్డేట్ చేయించుకోవడం. 5 నుంచి 7 సంవత్సరాల మధ్య గల చిన్నారుల వేలి ముద్రలను అప్డేట్ చేస్తారు. 15 నుంచి 17 మధ్య వయసు గల వారి బయోమెట్రిక్ వివరాలను సైతం ఉచితంగా నవీకరిస్తారు.

ఇలా నమోదు చేసుకోండి..

ఆధార్ కార్డులు జారీ సంస్థ యూనిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా (యూఐడీఏ) సంస్థ నవీకరణ నిబంధనలను విడుదల చేసింది. సమీపంలోని సచివాలయంలో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రానికి వెళ్లాలి. పుట్టిన తేదీని సరి చేసుకునేందుకు రుజువుగా పదో తరగతి మెమో, పాస్‌పోర్ట్, పాన్ కార్డులను అప్‌లోడ్ చేయాలి. చిరునామా మార్పు కోసం బ్యాంకు ఖాతా, పోస్ట్ ఆఫీస్ ఖాతా, రేషన్ కార్డు, ఓటర్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్ ఇవ్వాలి. చిన్నారులకు వారి తల్లిదండ్రుల వేలిముద్రలతో కార్డు జారీ చేస్తారు. ఐదేళ్లు పూర్తయిన తర్వాత మాత్రమే పిల్లల వేలిముద్రలు ఫోటో అప్డేట్ చేస్తారు. తొలిసారి ఆధార్ చేసుకునే పిల్లలకు ఉచితంగా చేస్తారు.



బెల్లంకొండ మండలంలో ఆధార్ అప్డేట్ చేస్తున్న సచివాలయ సిబ్బంది

సద్వినియోగం చేసుకోవాలి



ఎంపిక చేసిన గ్రామ సచివాలయాల్లో ఆధార్ శిబిరాలను ఏర్పాటు చేశాం. ఆధార్‌లో మార్పుల కోసం ఎక్కడికో వెళ్లాల్సిన అవసరం లేదు. మార్పులు చేర్పుల కోసం సంబంధిత పత్రాలతో కేంద్రాలకు వెళ్లి నమోదు చేసుకోవాలి. కేంద్రాలపై ప్రజాప్రతినిధులు గ్రామాల్లో చైతన్యం కల్పించారు.

– వై.హనుమారెడ్డి, ఎంపీడీవో, బెల్లంకొండ

జూదరుల అరెస్ట్

పెదకూరపాడు: మండలంలోని లింగంగుంట్ల గ్రామంలో పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ గిరి బాబు మంగళవారం తెలిపారు. వారి నుంచి రూ.1,150 స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

చెట్టినాడ్ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల ఆందోళన

దాచేపల్లి : పెదగార్లపాడు చెట్టినాడ్ సిమెంట్ ఫ్యాక్టరీ వద్ద కార్మికులు మంగళవారం ఆందోళన చేపట్టారు. కాంట్రాక్టర్‌కి యజమాన్యం బిల్లులు చెల్లించకపోవడంతో కార్మికులకు వేతనాలు చెల్లించలేదు. కార్మికులు ప్రధానగేట్ వద్దకు చేరుకుని గేట్లు వేసి ఆందోళనకు దిగారు. యజమాన్య ప్రతినిధులు కార్మికులకు త్వరలో బకాయిలు చెల్లిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

